సీఎస్ శాంతికుమారికి స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈఓ భాస్కర్‌రావు

యాదగిరీశుడికి దర్బార్ సేవోత్సవం

యాదగిరిగుట్ట, జూన్ 25 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి దర్బార్ సేవోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. మంగళవారం ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి సేవోత్సవాన్ని నిర్వహించారు. నాలుగు వేదాలు స్వామివారికి పారాయణం చేసి, స్వామివారి స్వస్తి మంత్రార్థ వంటి మంత్రాలతో శాంతింపజేశారు. నక్షత్ర హారతి ఇచ్చి స్వామివారిని కొలిచారు. ఉదయం స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహుడు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్ర నామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అనంతరం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజ వాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో కల్యాణోత్సవ సేవను ఊరేగించారు. అనంతరం లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ నిత్య తిరు కల్యాణ తంతు జరిపారు. ప్రధానాలయ ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణ పుష్పార్చన జరిపించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల వెండి మొక్కుజోడు సేవోత్సవం వైభవంగా చేపట్టారు. క్షేత్రపాలకుడు ఆంజనేయ స్వామికి ఆకుపూజ నిర్వహించారు. హనుమంతుడిని సింధూరంతో అలంకరించి అభిషేకించారు. తమలపాకులతో అర్చించి లలితాపారాయణం చేశారు. సుమారు 10వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. స్వామివారి ఖజానాకు రూ.22,11,322 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

స్వామివారి సేవలో సీఎస్..

లక్ష్మీనరసింహస్వామివారి సేవలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పాల్గొన్నారు. మంగళవారం ఆలయానికి వచ్చిన ఆమెకు ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యుల బృందం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలోకి వెళ్లి స్వయంభూ పంచనారసింహుడికి పూజలు నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో ఆమెకు ప్రధానార్చక బృందం ఆశీర్వచనం చేయగా.. ఆలయ ఈఓ భాస్కర్‌రావు స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం రామలింగేశ్వర ఆలయంలో పరమశివుడిని దర్శించుకున్నారు.

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ

రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వ్యవసాయ అధికారులు, రైతులు

గుండాల, జూన్ 25 : రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేశారు. ఈ సందర్భంగా రైతు భరోసా పథకం కింద ప్రభుత్వం నుంచి ఏ విధంగా సాయం అందిస్తే బాగుంటుందని స్థానిక వ్యవసాయ అధికారులు రైతుల అభిప్రాయాలను సేకరించారు. పలువురు రైతులు మాట్లాడుతూ సాగు చేసే భూమికే రైతు భరోసా సాయం అందించాలని, 10 ఎకరాల వరకు పెట్టుబడి సాయం అందిస్తే బాగుంటుందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఇన్‌కం ట్యాక్స్ చెల్లించే వారికి రైతు భరోసా పథకం వర్తించకూడదని పేర్కొన్నారు. అనంతరం వానకాలంలో సాగు చేసే పంటల గురించి వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏఓలు లావణ్య, దీప్తి, అరుణ కుమారి, స్వప్న, ఏఈఓలు క్రాంతికుమార్, రామ్‌సింగ్, రైతులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి : ఎక్సైజ్ సీఐ దీపిక

ఈత మొక్కను నాటుతున్న ఎక్సైజ్ సీఐ దీపికగౌడ్

రాజాపేట, జూన్ 25 : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఆలేరు ఎక్సైజ్ సీఐ దీపికగౌడ్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన సందిల రమేశ్‌గౌడ్ వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం ఈత మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ చామకూర గోపాల్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు పంజాల శ్రవణ్ గౌడ్, సందిల భాస్కర్‌గౌడ్, రాగీరు బాలయ్యగౌడ్ పాల్గొన్నారు.

గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించాలి : డీవైఎఫ్ఐ

సర్వేలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకట్

భువనగిరి కలెక్టరేట్, జూన్ 25 : రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకట్ అన్నారు. మండలంలోని అనాజీపురంలో మంగళవారం నిర్వహించిన యువజన సర్వేలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో అనేక మంది క్రీడాకారులు ఉన్నారని, వారికి ప్రభుత్వ ప్రోత్సాహం లేక క్రీడా నైపుణ్యాన్ని మరిచిపోయి ఇతర పనులకు వెళ్తున్నారని అన్నారు. ప్రభుత్వం క్రీడలపై ప్రత్యేక దృష్టి పెట్టి గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలని కోరారు. నైపుణ్యం కలిగిన యువతను గుర్తించి రాష్ట్ర, జిల్లా స్థాయిలో అవగాహన తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు అబ్దుల్లాపురం వెంకటేశ్, మండలాధ్యక్షుడు బొల్లేపల్లి శ్రీకాంత్, నాయకులు నవీన్, ప్రవీణ్, కిషన్, పవన్, నరేశ్ పాల్గొన్నారు.

వర్షాలు కురువాలని బొడ్రాయికి పూజలు



బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న మహిళలు

సంస్థాన్ నారాయణపురం, జూన్ 25 : వర్షాలు కురువాలని మండలంలోని శేరిగూడెం గ్రామంలో మహిళలు, గ్రామస్తులు మంగళవారం బొడ్రాయికి జలాభిషేకం, పూజలు చేశారు. మాజీ సర్పంచ్ శైలజ, శ్రీనివాస్‌రెడ్డి, భిక్షం, సత్యనారాయణ, నర్సింహ, మహిళలు పాల్గొన్నారు.

విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలి : బీజేవైఎం

చౌటుప్పల్, జూన్ 25 : విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని పట్టణంలోని ప్రైవేటు విద్యాసంస్థల యజమానులకు బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రాలు అందజేశారు. పేద విద్యార్థులకు ఫీజుల్లో 25శాతం రాయితీ ఇవ్వాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనిచేయాలని, పాఠశాలల్లో పుస్తకాలు విక్రయించవద్దని అన్నారు. నోటీసు బోర్డులో ఫీజుల పట్టిక ఏర్పాటు చేయాలని కోరారు. బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దిండు భాస్కర్ గౌడ్, మండలాధ్యక్షుడు వంశీగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- 18 కుల వృత్తుల వారికి కేంద్ర ప్రభుత్వం చేయూత
- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, జూన్ 25 : సాంప్రదాయ చేతివృత్తులు, హస్త కళాకారులు ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన పీఎం విశ్వకర్మ పథకం అమలు కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 7,627 దరఖాస్తులు వచ్చాయని, వాటిని గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ స్థాయిలో పరిశీలించి 3,771 దరఖాస్తులను జిల్లా స్థాయికి పంపారన్నారు. అందులో 2,059 దరఖాస్తులను గతంలో రాష్ట్ర స్థాయికి పంపించినట్లు తెలిపారు. మిగిలిన 1,712 దరఖాస్తులను రాష్ట్ర స్థాయి కమిటీకి పంపడానికి జిల్లా కమిటీ ఆమోదం తెలిపిందని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో ఇప్పటి వరకు 1,059 దరఖాస్తులకు ఆమోదం తెలుపగా.. అందులో 559 మందికి ఏడు రోజుల శిక్షణ పూర్తి చేసినట్లు చెప్పారు. అర్హులైన వారికి విశ్వకర్మ పథకం ద్వారా లబ్ధి చేకూర్చాలని, విశ్వకర్మ పథకం అమలు, దరఖాస్తు చేసుకునే విధానంపై గ్రామ, పట్టణ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

వృత్తిదారులకు సామర్థ్యం పెంపే లక్ష్యం

చేతి, కుల వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారిలో సామర్థ్యం మెరుగుపరిచి ఉత్పాదకత, నాణ్యత, ఉత్పత్తులను పెంచడం ఈ పథకం ఉద్దేశమని తెలిపారు. ఈ పథకంలో చేరడం వల్ల విశ్వకర్మ సర్టిఫికెట్, గుర్తింపు కార్డుతోపాటు నైపుణ్యాభివృద్ధి పెంపొందించుకొనుటకు శిక్షణ, టూల్ కిట్, రుణ సదుపాయం, డిజిటల్ లావాదేవీలకు ప్రోత్సాహకం, మార్కెటింగ్ చేసుకొనుటకు మద్దతు లభిస్తుందని అన్నారు. కమ్మరి, వడ్రంగి, కంసాలి, చాకలి, మంగలి, ఉప్పరి, ఎరుకల, దర్జీ, చీపుర్లు, బుట్టల తయారీ, బార్బర్, చెప్పులు కుట్టేవారు, పని ముట్లు, తాళాల తయారీ, శిల్పి, స్వర్ణకారులు, దోబీ, బొమ్మల తయారీ, చేపల వల, దండలు చేసేవారు, తాపీ పని వంటి 18 కుల వృత్తుల వారికి కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా చేయూత అందించనుందని తెలిపారు. కుటుంబంలో ఒకరు అర్హులని, విద్యార్హత లేకున్నా 18 సంవత్సరాలు పైబడిన వారు పేరు నమోదు చేసుకోవచ్చని, కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉండరాదని అన్నారు. కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా ఆన్‌లైన్‌లో రేషన్, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, మొబైల్ నెంబర్‌తో రిజిస్టర్ చేసుకోవాలని, ఆ దరఖాస్తులను గ్రామ పంచాయతీ స్క్రీనింగ్ చేసి జిల్లా స్థాయి అమలు కమిటీకి పంపుతుందని తెలిపారు.

ఎంపికైన వారికి రెండు రకాల శిక్షణ

ఎంపికైన వారికి ప్రాథమిక నైపుణ్యం ద్వారా 5నుంచి 7రోజులు, అధునాతన నైపుణ్యానికి 15 రోజులు శిక్షణ ఇస్తారని అన్నారు. శిక్షణ కాలంలో నిత్యం రూ.500 భృతి, అనంతరం రూ.15వేల విలువైన టూల్ కిట్లు, ధ్రువీకరణ పత్రం అందజేస్తారని తెలిపారు. మొదటి విడుతలో 5శాతం వడ్డీతో లక్ష రూపాయల రుణం ఇస్తారని, దీనిని 18 నెలల్లో చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. రెండో విడుతలో రూ.2 లక్షల రుణం ఇస్తారని, ఆ డబ్బును 30 నెలల వ్యవధిలో చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కె.గంగాధర్, జిల్లా పరిశ్రమల అధికారి జె.రాజేశ్వర్‌రెడ్డి, ఎంఎస్ఎంఈ సహాయ సంచాలకులు సుమతి, లీడ్ బ్యాంక్ అధికారి శివరామకృష్ణ, బీసీ అభివృద్ధి అధికారి యాదయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యామ్‌సుందర్, జిల్లా మత్స్య శాఖ అధికారి రాజారాం, కమిటీ డొమైన్ ఎక్స్‌పర్ట్స్ డి.లక్ష్మీనారాయణగౌడ్, ఎన్.మొగులయ్య, ఆర్.నరేందర్, అధికారులు పాల్గొన్నారు.

శిఖం మట్టి తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలి

- పోలీస్‌స్టేషన్‌లో నీటి పారుదల శాఖ అధికారుల ఫిర్యాదు

విచారణ చేస్తున్న తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి

రామన్నపేట (వలిగొండ), జూన్ 25 : కుంట శిఖంలోని మట్టిని అక్రమంగా తరలించి వ్యాపారం చేయాలనుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నీటి పారుదల శాఖ అధికారులు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్థానికుల ఫిర్యాదుల మేరకు రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు క్యాసనోని బావి కుంటను పరిశీలించి అక్రమంగా తరలించిన కుంట మట్టిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి గ్రామంలో విచారణ చేసి మాట్లాడారు. మండలంలోని రెడ్లరేపాక గ్రామ రెవెన్యూ పరిధిలోని క్యాసనోనిబావి కుంట శిఖం నుంచి పంతంగి రాజు మూడ్రోజులుగా రాత్రి పూట సుమారు 800కు పైగా ట్రిప్పుల మట్టిని అక్రమంగా తరలించి తన భూమిలో డంప్ చేశాడన్నారు. ఆ మట్టిని గుర్తించి సాక్షుల సమక్షంలో పంచనామా చేసి సీజ్ చేసినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న రామన్నపేట నీటి పారుదల శాఖ అధికారులు కుంటను పరిశీలించారు. మట్టిని తవ్విన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని నీటి పారుదల శాఖ ఏఈ శిల్ప తెలిపారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి కరుణాకర్‌రెడ్డి, ఏఆర్ఐ మనోహర్, రెవెన్యూ సహాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అయ్యాన్ ఆగ్రో ఫార్మాలో అధికారుల తనిఖీ

- వ్యర్థాల శాంపుల్స్ సేకరణ

కంపెనీలో వ్యర్థాలను సేకరిస్తున్న పీసీబీ అధికారులు

చౌటుప్పల్, జూన్ 25 : మున్సిపాలిటీ పరిధి తంగడపల్లి గ్రామంలోని అయ్యాన్ ఆగ్రో ఫార్మా పరిశ్రమను ఆర్డీఓ వి.శేఖర్‌రెడ్డి, పీసీబీ డీఈ సురేశ్ మంగళవారం పరిశీలించారు. ఈ పరిశ్రమ వెదజల్లుతున్న దుర్వాసనపై ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో వారు కంపెనీలో పరిశీలించి వ్యర్థాల శాంపుల్స్ సేకరించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పీసీబీ అధికారులతో కలిసి పరిశ్రమలో తనిఖీ చేసినట్లు ఆర్డీఓ తెలిపారు. సేకరించిన వివరాలతో నివేదికను ఉన్నతస్థాయి అధికారులకు అందజేయనున్నట్లు పీసీబీ డీఈ తెలిపారు. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో ఫిర్యాదు రావడంతో ఈ పరిశ్రమను మూసి వేసినట్లు ఆయన తెలిపారు. తాత్కాలిక అనుమతులు తీసుకొని తిరిగి పరిశ్రమను నడిపిస్తున్నారని, ఇందుకోసం రూ.10లక్షల బ్యాంక్ షూరిటీ అడిగితే ఇవ్వలేదని చెప్పారు. పరిశ్రమలో ఉత్పత్తులు చేసిన తర్వాత కూలింగ్ ప్రక్రియ లేకపోవడంతో దుర్వాసన అధికంగా వస్తున్నదన్నారు. ఈటీపీ ప్లాంటుకు స్క్రైబర్ లేకపోవడం మరో కారణమని చెప్పారు. వారి వెంట తాసీల్దార్ హరికృష్ణ, ఆర్ఐ బానాల రాంరెడ్డి, పీసీబీ ఏఈ సాజీనా బేగం, ఎన్విరాల్‌మెంట్ సైంటిస్ట్ రామకృష్ణ ఉన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

తుర్కపల్లి : విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

తుర్కపల్లి, జూన్ 25 : మండలంలోని మాదాపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మంగళవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. అంతకు ముందు గ్రామ దేవతల ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ బూక్యా సుశీలారవీందర్, వైస్ ఎంపీపీ మహదేవుని శ్రీనివాస్, నాయకులు సుంకరి శట్టయ్య, కొమురయ్య, రాజు పాల్గొన్నారు.

భువనగిరి కలెక్టరేట్ : మండలంలోని ముత్తిరెడ్డిగూడెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మై ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కుమార్తె కీర్తిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ప్రయోజకులుగా ఎదుగాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్య అందుతుందని, విద్యావంతులైన ఉపాధ్యాయులతో చక్కని బోధన అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో మై ఫ్రెండ్స్ అసోసియేషన్ నిర్వాహకుడు రఘుబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ఆర్థిక సాయం

గుండాల, జూన్ 25 : మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన గవ్వల అయిలయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బీఆర్ఎస్ గ్రామ శాఖ నాయకులు మంగళవారం అయిలయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బండారి శ్రీనివాస్, వట్టిపల్లి రాజయ్య, రామచంద్రు, పూల వెంకన్న, కొత్తపల్లి శ్రీను, మందుల రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఐలయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పేకాడుతున్న 12 మందిపై కేసు

మోత్కూరు, జూన్ 25 : మున్సిపాలిటీ కేంద్రంలో పేకాట ఆడుతున్న 12 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఇందిరానగర్‌లో మెయిన్ రోడ్డు వెంట ఉన్న అన్నెపు మురళి ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు మంగళవారం పోలీసులు దాడి చేశారు. 12 మందిని అరెస్టు చేసి, వారి వద్ద రూ.27,040 నగదు, 5 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సాంకేతిక శిక్షణ కోర్సులకు దరఖాస్తులు

భూదాన్ పోచంపల్లి, జూన్ 25 : మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో మేధా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఉపాధి సాంకేతిక కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు నెలల కాల పరిమితితో కూడిన ఎలక్ట్రీషన్, (డొమెస్టిక్), సోలార్ సిస్టం ఇన్‌స్టాలేషన్ మరియు సర్వీస్ (ఐటీఐ డిప్లమో పాస్), కంప్యూటర్ హార్డ్‌వేర్, సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్, సీసీ టీవీ టెక్నీషియన్ (పదో తరగతి) టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జర్దోజి, బ్యాగ్ మేకింగ్ (ఎనిమిదో తరగతి) కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒరిజినల్ సర్టిఫికెట్, జిరాక్స్ సెట్, పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు, ఆదాయం ధ్రువీకరణ పత్రాలతో రామానంద గ్రామీణ సంస్థలో జూలై 1న ఉదయం 10 గంటలకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 9133908000, 9133908111, 9133908222, 9948466111 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బైండోవర్ ఉల్లంఘించిన మహిళకు రూ.50వేల జరిమానా

సంస్థాన్ నారాయణపురం, జూన్ 25 : సారా అమ్మి పట్టుబడి తాసీల్దార్ ముందు బైండోవర్ చేసిన తరువాత నిబంధనలు ఉల్లంఘించిన గిరిజన మహిళకు రూ.50వేల జరిమానా విధించారు. రామన్నపేట ఎక్సైజ్ ఎస్ఐ బాలాజీనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెంకంబావి తండాకు చెందిన కరంటోతు మస్రు గతంలో సారా తయారు చేసి పట్టుబడడంతో నారాయణపురం తాసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. పదే పదే బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించడంతో రూ.50వేల జరిమానా విధించి మంగళవారం వసూలు చేసినట్లు తెలిసారు. సారా తయారు చేయడం, అమ్మడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్ఐ బాలాజీనాయక్ హెచ్చరించారు.

పాల సంఘాల చైర్మన్ల ఎన్నిక

మోత్కూరు, జూన్ 25 : మండలంలోని పాలడుగు, ఆరెగూడెం పాల సంఘాల చైర్మన్ల ఎన్నికలను మంగళవారం నిర్వహించారు. పాలడుగు పాల సంఘం చైర్మన్‌గా ఎడ్ల భగవంతు, ఆరెగూడెం చైర్మన్‌గా ముసుకు వెంకట్‌రెడ్డి ఎన్నికయ్యారు.

ఆరెగూడెం పాల సంఘం నూతన కార్యవర్గంతో చైర్మన్ వెంకట్‌రెడ్డి

మందనపల్లి పాల సంఘం చైర్మన్‌గా వెంకటేశ్

ఆలేరు రూరల్, జూన్ 25 : మందనపల్లిలో పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా నోముల వెంకటేశ్, డైరెక్టర్లుగా సోకం వెంకటేశ్, ఐల స్వాతి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకం

రాజాపేట, జూన్ 25 : మండలంలోని రేణికుంట గ్రామ శివారులో గల సంకల్ప సిద్ధి వేంకటేశ్వరాలయంలో మంగళవారం పంచామృతాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ ధర్మకర్తలు, రెయిన్‌బో డెవలపర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి

కార్యకర్తలే బీఆర్ఎస్ బలం

- భవిష్యత్‌లో అధికారం మనదే : మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత

బొమ్మలరామారం, జూన్ 25 : కార్యకర్తలే బీఆర్ఎస్ పార్టీకి బలమని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చౌదర్‌పల్లి గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ఉన్నప్పుడు ఉన్నత పదవులు అనుభవించిన వారు కష్టకాలంలో పార్టీని విడిచిపోవడం దారుణమన్నారు. పార్టీని వీడిన నాయకులంతా భవిష్యత్తులో అనామకులుగా నిలిచి పోతారని పేర్కొన్నారు. గతంలో పార్టీని వీడిన నాయకులు రాజకీయాల్లో అడ్రస్ లేకుండా పోవడం చూశామన్నారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి వంటి సీనియర్ నాయకులు కష్టకాలంలో పార్టీని వీడటం దారుణమని, పార్టీ మారిన ఎమ్మెల్యేలపై ఫిరాయింపు నిరోధక చట్టం ప్రకారం అనర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యకర్తల త్యాగాల పునాదుల మీద ఏర్పడ్డ బీఆర్ఎస్‌ను అంతమొందించడం ఎవరి తరం కాదన్నారు. కార్యకర్తలు కుంగిపోవద్దని, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ శ్రేణులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, భవిష్యత్తులో మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గొడుగు చంద్రమౌళి, భువనగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుషంగల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ కూర వెంకటేశ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోలగాని వెంకటేశం గౌడ్, నాయకులు మల్లారెడ్డి, సురేందర్‌రెడ్డి, నవీన్‌గౌడ్, భరత్, పెద్దులు, శ్రీధర్, శ్రీశైలం యాదవ్, మల్లేశం పాల్గొన్నారు

లాభాల బాటలో ఆలేరు పీఏసీఎస్

- సొసైటీ చైర్మన్ మల్లేశ్‌గౌడ్

మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ మల్లేశ్‌గౌడ్

ఆలేరు రూరల్, జూన్ 25 : ఆలేరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లాభాల బాటలో సాగుతుందని పీఏసీఎస్ చైర్మన్ మొగులగాని మల్లేశ్‌గౌడ్ అన్నారు. సొసైటీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023 ఏప్రిల్ 1నుంచి 2024 మార్చి 31 వరకు పంపిణీ చేసిన దీర్ఘకాలిక రుణాలతోపాటు కొత్త పంట రుణాల వివరాలను, రైతులకు జరిగిన రుణ మాఫీని వెల్లడించారు. 50మంది సభ్యులకు రూ.3,03,62,937 దీర్ఘకాలిక రుణాలను, 1,50,19,564 రూపాయల కొత్త పంట రుణాలు అందజేసినట్లు తెలిపారు. 370 మంది రైతులకు రూ.2.71కోట్ల రుణ మాఫీ అయ్యిందన్నారు. ఎరువుల వ్యాపారంతో రూ.1,42,10,730, విత్తనాలపై 1,71లక్షల వ్యాపార లావాదేవీలు జరిగాయని తెలిపారు. సమావేశంలో బ్యాంక్ సూపర్‌వైజర్ కోటిరెడ్డి, సీఈఓ వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ చింతకింది చంద్రకళ, డైరెక్టర్లు బీసు కృష్ణంరాజుగౌడ్, గవ్వల నర్సింహులు, ఆరె మల్లేశ్‌గౌడ్, కూళ్ల సిద్దులు, బైరపాక లక్ష్మి, దారెడ్డి శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ పోలీసుల దాడులు

బెల్లం పానకం పారబోస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఆలేరు రూరల్, జూన్ 25 : ఆలేరు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో సారా తయారీ కేంద్రాలపై మంగళవారం దాడులు నిర్వహించారు. తుర్కపల్లి మండలం శ్రీనివాసపురంలోని అటవీ ప్రాంతంలో సారా తయారీకి వినియోగించే 20లీటర్ల బెల్లం పానకాన్ని పారబోశారు. సారా తయారీ, అమ్మేవారిపై ముమ్మర దాడులు జరిపి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ దీపిక హెచ్చరించారు.

'రామన్నపేటలో అదనపు ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి'

తాసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

రామన్నపేట, జూన్ 25 : మండల కేంద్రంలో అదనపు ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు తాసీల్దార్ లాల్‌బహదూర్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం మాట్లాడుతూ మండల కేంద్రంలో ఒకే ఆధార్ కేంద్రం ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామాల ప్రజలు తమ పనులను వదులుకొని రెండు, మూడు రోజులు ఆధార్ కేంద్రానికి తిరగవలసి వస్తున్నదని పేర్కొన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారని, గతంలో మూసేసిన ఆధార్ కేంద్రాన్ని తిరిగి ప్రారంభించాలని, గ్రామాల్లో క్యాంపులు నిర్వహించాలని కోరారు.

కార్యక్రమంలో నాయకులు వేముల మహేందర్, అప్పం సురేందర్, కంకల శేఖర్, కృష్ణతేజ, తాళ్లపల్లి హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పీర్ల కొట్టం భూమిని కాపాడాలని వినతి



మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్‌కు వినతి పత్రం ఇస్తున్న స్థానికులు

చౌటుప్పల్, జూన్ 25 : పట్టణంలోని పీర్ల కొట్టం భూమి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్ నాయక్‌కు మంగళవారం స్థానికులు వినతి పత్రం అందజేశారు. ఈ విషయంపై గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. అక్రమంగా నిర్మించిన కట్టడాలను తొలగించి పీర్ల కొట్టం భూమిని కాపాడాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో చింతకింది అంజయ్య, ఎం.శంకరయ్య, ఎం.కిష్టయ్య, పల్సం సత్యం, శ్రీను ఉన్నారు.

పాల సంఘం చైర్మన్ నర్సింహకు శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

దత్తాయిపల్లి పాల సంఘం చైర్మన్‌గా నర్సింహ

తుర్కపల్లి, జూన్ 25 : మండలంలోని దత్తాయిపల్లి పాల సంఘం చైర్మన్‌గా ఎద్దు నర్సింహ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం నిర్వహించిన ఎన్నికల్లో డైరెక్టర్లుగా గిద్దె సుధాకర్, గుంటి ఆంజనేయులు ఎన్నికయ్యారు. అనంతరం చైర్మన్, డైరెక్టర్లను బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గిద్దె కర్ణాకర్, మాజీ ఎంపీటీసీ రఘురాములు, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మాధవరం కృష్ణ, నాయకులు ప్రభాకర్, బాలరాజు, సత్తయ్య, కిషన్‌రావు పాల్గొన్నారు.